# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, జూన్ 14 : పేదింటి ఆడపడుచుల పెండ్లిలకు సాయం చేస్తూ వారికి అండగా నిలిచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని గౌరీ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డిలతో కలిసి 926 మంది లబ్ధిదారులకు రూ. 9.26 కోట్ల చెక్కులను అందజేశారు. ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తులం బంగారం ఇస్తామని పేదింటి ఆడపడుచులకు మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఆడపడుచులకు ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పరామర్శ..



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, జూన్ 14 : కల్హేర్ మండల పరిధిలోని అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నారాయణ భార్య, మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన కార్యకర్త మంగలి అంజయ్య, నిజాంపేట్ మండలం రాంరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై చికిత్సపొందారు. ఈ మేరకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహరెడ్డి, మండలాధ్యక్షుడు రాంసింగ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దిలీప్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర్, శ్రావణ్‌కుమార్, నాయకులు కుర్మ సాయిగౌండ, జనార్దన్ రెడ్డి, అశోక, సుధాకర్, సాయిగౌండ, పోచయ్య, వెంకటేశం, బాలయ్య, ఆగంగౌడ్, శ్రీనివాస్, అంజయ్య, శివరాములు, సిద్ధు, సంగయ్య, అనంతగౌడ్, సాయిలు, తదితరులు ఉన్నారు.

# పంట కాల్వల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం

సిర్గాపూర్, జూన్ 14 : నల్లవాగు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాల్వల్లో చెత్తా, చెదారం పేరుకుపోయింది. అక్కడక్కడ పంట కాల్వల గోడలు శిథిలమై కూలాయి. ప్రాజెక్టు కింద పంటల ఆయకట్టు సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్టు కింద ఖరీఫ్ పంట సాగుకు సమయం ఉన్నందున పంట కాల్వలను శుభ్రం చేయించి, నీటి పారుదలకు ఆటంకం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు ఏఈఈ అలేఖ్యరెడ్డిని వివరణ కోరగా, పంట కాల్వలు రెండేళ్ల కోసారి క్లీనింగ్ చేస్తామన్నారు. అయితే ఈ ఏడాదిలో ఈ పనులు చేపట్టేందుకు అనుమతి, నిధుల మంజూరుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



నల్లవాగు ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వలో చెత్తా, చెదారం

# మూడురోజులుగా సరఫరా కాని మిషన్‌భగీరథ నీళ్లు



జీర్గితండాలో నీటికోసం ఖాళీ బిందెలతో బోరువద్ద వేచిఉన్న ప్రజలు

కంగ్టి, జూన్ 14 : కంగ్టి, దెగుల్‌వాడి, భీంరా, జీర్గితండా, తుర్కవడగామ, నాగూర్(కె), నాగూర్(బి) తదితర గ్రామాలకు మూడురోజులుగా మిషన్‌భగీరథ నీళ్లు సరఫరా కాకపోవడంతో గ్రామాలు, తండాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాత్రిపగలు నీటికోసం సుదూరంలో ఉన్న ప్రైవేట్ మోటర్ల ద్వారా నీటిని మోస్తున్నారు. మూడురోజులుగా కంగ్టి సబ్‌స్టేషన్ పరిధిలోని కరెంట్ అంతరాయం నెలకొనడంతో మిషన్‌భగీరథ నీళ్లు గ్రామాలకు సరఫరా కాలేదు. దీంతో ప్రతిరోజు ఉదయం సరఫరా కావాల్సిన నీళ్లు మూడురోజులుగా సరఫరా కాకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

## భర్త, ఇద్దరు కుమార్తెలకు గాయాలు

పటాన్‌చెరు రూరల్, జూన్ 14 : ప్రైవేటు బస్సు ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదంలో బిడ్డలతో పాటు స్కూటీపై ప్రయాణిస్తున్న భార్య మృతి చెందిన సంఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం క్రిష్టారెడ్డిపేట్‌లో నివాసం ఉంటున్న పవన్, శ్రావణి (35) దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శనివారం పటాన్‌చెరులోని ప్రముఖ షాపింగ్‌మాల్‌కు భార్యభర్తలు పవన్, శ్రావణి, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి స్కూటీపై బయలు దేరారు. పటాన్‌చెరులోకి ఓఆర్‌ఆర్ వైపుగా ఎంట్రీ కాగానే వారి ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు టైరు ఎక్కడంతో తీవ్రగాయాలతో శ్రావణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలకు గురైన పవన్, దీపస్వీ, రిశస్వీలను పటాన్‌చెరులోని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

# విద్యుత్ ఘాతానికి క్లీనర్ సజీవ దహనం

జిన్నారం, జూన్ 14 : కంకర అన్‌లోడ్ చేసేందుకు టిప్పర్ హైడ్రాలిక్ పైకి లేపడంతో విద్యుత్ వైర్లకు తగిలి క్లీనర్ సజీవ దహనమైన సంఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిల్వానీ స్టోన్ క్రషర్‌లో కొంతకాలంగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ సుజన్ (38) టిప్పర్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున స్టోన్ క్రషర్ వద్ద కంకర అన్లోడ్ చేసే క్రమంలో టిప్పర్ హైడ్రాలిక్ పైకి లేపడంతో విద్యుత్ హై టెన్షన్ వైర్లకు తగలడంతో రామ్ సుజన్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున చెలరేగిన మంటల్లో టిప్పర్ పూర్తిగా దగ్ధమవ్వగా రామ్ సుజన్ సజీవ దహనమయ్యాడు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు రూరల్, జూన్ 14 : ఇస్నాపూర్‌లో గుర్తుపట్టలేని స్థితిలో, రక్తపుమడుగులో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పటాన్‌చెరు పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని సదాశివనగర్ కాలనీలో, ఎస్‌ఎం దవాఖాన సమీపంలోని ఒక ఇంట్లో తాళం వేసిన గది నుంచి శుక్రవారం దుర్వాసన రావడం ప్రారంభమైంది. రాత్రి సమయానికి దుర్వాసన ముక్కుపుటలదిరేలా వ్యాపించడంతో స్థానికులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా, వ్యక్తి మృతదేహం కనిపించింది. రక్తపుమడుగులో, గుర్తుపట్టలేని స్థితిలో కనిపించింది. 20 రోజుల కింద ఒక కుటుంబం కర్నాటక నుంచి వచ్చి ఆ ఇంట్లో ఒక గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. కుటుంబ సభ్యులు రెండు రోజుల కింద ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. ఆ తర్వాత ఇంట్లో నుంచి దుర్వాసన రావడం ప్రారంభమైంది. వ్యక్తిని హత్య చేసి వారి కుటుంబ సభ్యులు పరారైనట్టుగా ప్రాథమింగా పోలీసులు భావిస్తున్నారు. అద్దెకు దిగిన కుటుంబం వివరాలు లేవు. ఈ మేరకు సీఐ వినాయక్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రాజీతో కేసులు పరిష్కరించుకోవాలి




సంగారెడ్డి కలెక్టరేట్: మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 14 : చిన్న చిన్న తగాదాలతో ఏర్పడిన కేసులను రాజీ కుదుర్చుకొని సామరస్యంగా, స్నేహ భావంతో కలిసిమెలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ భవానీ చంద్ర అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ చేయదగిన కేసుల్లో ఇరు వర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం 6,386 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ఇందులో క్రిమినల్ కంపౌండేల్ కేసులు,5859, సివిల్ కేసులు 15, మోటరు ప్రమాద పరిహారం కేసులు 18, ప్రీ లిటిగేషన్ కేసులు 22, బ్యాంకు రికవరీ కేసులు 234, సైబర్ క్రైమ్ కేసులు 87, విద్యుత్ చౌర్యం నిరోధక కేసులు 151 ఉన్నాయని వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కే జయంతి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి సునీత, రెండవ అదనపు సెషన్స్ జడ్జి డాక్టర్ కృష్ణార్జున్, నాలుగో అదనపు సెషన్స్ జడ్జి లావణ్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి డీవీఆర్ తేజో కార్తిక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి సౌజన్య, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**రాజీ మార్గంతోనే కేసులు పరిష్కారం**

జహీరాబాద్, జూన్ 14 : రాజీ మార్గంతోనే కేసులు సత్వర పరిష్కారమవుతాయని, తద్వారా డబ్బులు ఆదా చేసుకోవచ్చని జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని కోర్టు కాంపెక్స్‌లో సీనియర్ కోర్టు విభాగంలో ఒక్కొక్కటి చొప్పున ఎస్‌వోపీ, సివిల్, సైబర్ క్రైమ్‌తో పాటు 77 కేసులు పరిష్కారం కాగా బ్యాంకు సీఎల్పీ, ఎస్‌వోపీ, సైబర్‌క్రైమ్ కేసుల నుంచి రూ. 44.49 లక్షలు వసూళ్లు అయ్యాయి. జూనియర్ కోర్టు విభాగంలో 6 సివిల్ కేసులు, క్రిమినల్ కాంపౌడ్ కింద 76 కేసులు, 34 అడ్మిషన్ కేసులు, 12ఎక్సైజ్ కేసులు, 828 ఎస్‌టీసీ కేసులు పరిష్కరం కాగా, రూ. 6.77 లక్షలు వసూలు కావడంతో పాటు మొత్తం 1027 కేసుల పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితాదేవి తెలిపారు. అనంతరం ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ ఖలీల్, ఏజీపీ దత్తాత్రేయ, బార్ ప్రెసిడెంట్ గోపాల్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో 585 కేసులు పరిష్కారం**

నారాయణఖేడ్, జూన్ 14 : నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 585 కేసులను పరిష్కరించామని జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మందానీ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని కేసులు లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల సమ్మతంతో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు అధికారులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.

**అందోల్‌లో..**

అందోల్, జూన్ 14 : లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జోగిపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 228 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అసదుల్ల షరీఫ్ తెలిపారు. భూములు, ఎక్సైజ్, సైబర్‌క్రైమ్‌తో పాటు బ్యాంక్ కేసులను పరిష్కరించి ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. లోక్ అదాలత్ సభ్యులు నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, పీపీ స్వాతిగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సీఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేసులను పరిష్కరిస్తున్న జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి



నారాయణఖేడ్: లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి శ్రీధర్ మందాని



అందోల్: జోగిపేట లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి, పాల్గొన్న న్యాయవాదులు

# కంకోల్ సబ్‌సెంటర్‌కు చేరిన 108 అంబులెన్స్

మునిపల్లి, జూన్ 14 : మండల పరిధిలోని కంకోల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ దవాఖాన, ఇటీవల ప్రారంభించిన హెల్త్ సబ్ సెంటర్ వద్ద మండల ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మంత్రి చొరవతో 108 అంబులెన్స్ ఏర్పాటు చేశారు. కాగా, సంబంధిత వైద్య అధికారుల పెత్తనం, దౌర్జన్యంతో రాయికోడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం రావడంతో సంబంధిత అధికారులు స్పందించి కంకోల్ హెల్త్ సబ్ సెంటర్‌కు 108 అంబులెన్స్‌ను పంపించారు. దీంతో మండల ప్రజలకు 108 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కృజ్ఞతలు తెలిపారు.




కంకోల్‌కు చేరిన అంబులెన్స్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

# సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్, జూన్ 14 : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తమ భూసమస్యలను తీర్చేందుకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని రాయికోడ్ ఉప తహసీల్దార్ విజయ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కుస్నూర్, సీరూర్ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. రైతులు సమస్యలతో ప్రతి రోజు కార్యాలయాలకు తిరుగుతూ సమయం వృథా చేసుకోకుండా రైతులు ఈ సదస్సులో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఆర్‌ఐ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, రాధిక ఉన్నారు.

# రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

సదాశివపేట, జూన్ 14 : కాంగ్రెస్ ప్రభు త్వం రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని, వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నా రు. వర్షాకాలం ప్రారంభమవుతున్నా నేటికి రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటు లో లేవన్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ప్రవీణ్, నాయకులు రమేశ్ గౌడ్, భూషణం, యేసేబు, దశరథ్, నర్సింహులు, అనిల్, ఎండీ ఖయ్యూం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

# వీధి కుక్కల బెడద నివారణ చర్యలు

జిన్నారం, జూన్ 14 : బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చెత్తా, చెదారాన్ని, పిచ్చి మొక్కలను జేసీబీతో తొలిగించారు. పరిశుభ్రత కార్యక్రమాలను కమిషనర్ మధుసూదన్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం కాలనీ రోడ్ల పక్కన పోగైన చెత్తా, చెదారం, ఘన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పలు వార్డుల్లో సంచరిస్తున్న వీధి కుక్కల బెడద నివారణకు కమిషనర్ చర్యలు తీసుకున్నారు. వీధి కుక్కలను పట్టించి యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. ఆర్వో నర్సింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# మహిళ పై లైంగికదాడి

కంది, జూన్ 14 : ఓ మహిళపై బలవంతంగా లైంగికదాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ తెలిపారు. ఈ నెల 11న సాయంత్రం కంది గ్రామ శివారులో ఓ మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను కట్టెతో కొట్టి భయపెట్టి పక్క నే ఉన్న మామిడితోటలోకి లాక్కెళ్లి లైంగికదాడి చేసినట్లు తెలిపింది. నెల రోజుల కింద అదే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ మహిళను తన ఇంటికి తీసుకెళ్లి శారీరకం గా కలినట్లు ఆ మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో పరిశోధన ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

# పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో సర్పంచ్‌లు లేక నిధులు రాక పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. మండల పరిధిలోని బంబ్గి(కె) గ్రామంలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలతో నిండి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చర్చిగల్లీలో ఉన్న నీటి ట్యాంకు పూర్తిగా పాకురుతో నిండుకుంది. అధికారులు సందర్శించి, రోగాల బారిన పడకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-రాయికోడ్, జూన్ 14





# డంపింగ్‌యార్డును రద్దు చేయాలి

గుమ్మడిదల, జూన్ 14 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైతు జేఏసీ నాయకులు రాష్ట్రప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. శనివారానికి 130వ రోజులు చేరుకున్న రిలే నిరాహారదీక్షల్లో రైతు జేఏసీ నాయకులు మాట్లాడారు. నాలుగు నెలలకుపైగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మనస్సు కరుగడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సర్కారు మొండివైఖరిని విరమించుకొని డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

# డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

## కార్పొరేటర్ మొట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు, జూన్ 14 : వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డ్రైనేజీలో చెత్తా వేయరాదని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌లోకి అంబేద్కర్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. వర్షాలు కురవడంతో డ్రైనేజీలో చెత్తా నిండిపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని కాలనీ వాసులు తెలిపారు. డ్రైనేజీ కాల్వలో ఉన్న చెత్తాను తొలిగించేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి పంపిస్తామన్నారు. కాలనీ ప్రజలు డ్రైనేజీ కాల్వలో చెత్తవేయడంతో మురుగు బయటకు వస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని చెత్తా వేయకుండా చూడాలన్నారు.



అంబేద్కర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

# కోదండ సీతారామస్వామి ఆలయంలో కార్పొరేటర్ పూజలు

పటాన్‌చెరు, జూన్ 14 : పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. శాంతినగర్ కాలనీలో ఉన్న హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేశం గౌడ్, సత్యనారాయణ, అజ్మత్, కారు రాజు, మిల్క రవి, ఎల్లారెడ్డి, మురళి, రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

# విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి

పటాన్‌చెరు రూరల్, జూన్ 14 : పాటి గ్రామ పరిధిలోని డైమెంట్ బ్రిక్స్ పరిశ్రమలో కరెంట్‌షాక్‌తో కార్మికుడు మృతి చెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటిలో ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన దినేశ్ బోయి (22) స్థానికంగా ఉంటూ డైమండ్ బ్రిక్స్ పరిశ్రమలో ప్లాంట్‌లో మిక్సర్ క్లీనర్. శనివారం రోజు విధులకు వచ్చిన దినేశ్ బోయి కాంక్రిట్ మిక్సింగ్ మషిన్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో దినేశ్ బోయి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అతడితో పాటు పరిశ్రమలో పనిచేసే బిబెకానంద్ మాంజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాజమాన్యం నిర్లక్ష్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఇంటి ఆవరణలో చిరుత సంచారం

కల్హేర్, జూన్ 14: కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్ గ్రామానికి చెందిన గుండు మోహన్ ఇంటి ఆవరణలోకి శనివారం మధ్యాహ్నం చిరుత వచ్చింది. ఆ సమయం లో మోహన్ కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. అయితే ఇంటి తలుపులు మూసి ఉండడంతో ఇంట్లోకి చిరుత రాలేదన్నారు. చిరుత వచ్చిన సమాచారాన్ని గ్రామస్తులు తెలుపగా, కొందరు కర్రలతో వచ్చి అరుపులు, కేకలు వేయడంతో చిరుత ప్రహరీపై నుంచి పొలాల్లోకి వెళ్లిపోయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అటవీ శాఖ అధికారులు తెలుసుకొని బీబీపేట్ చేరుకొని చిరుత వివరాలు తెలుసుకున్నారు.



ఆవరణలో తిరుగుతున్న చిరుత

# సస్యరక్షణ చర్యలతోనే పంటల దిగుబడి

జహీరాబాద్, జూన్ 14 : సస్యరక్షణ చర్యలతోనే పంటల దిగుబడిని సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, రాష్ట్ర చెరుకు అభివృద్ధి శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. శనివారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామంలో తెగుళ్లు, చీడపురుగులు ఆశించిన చెరుకు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. చెరుకు పంటలకు ఆశించిన పోక్కబోయింగ్ అనే తెగుళ్లు, చీడపురుగులు ఆశించిందని, దీనితో పంట ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుందన్నారు. ఆయన వెంట గోదవరి గంగా ఆగ్రోప్రోడక్స్ ప్రైవేటు లిమిటెడ్ చక్కర కార్మాగారం ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫీల్డ్‌మెన్ సంగమేశ్వర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



చెరుకు పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్

# సెంట్రల్ జైల్ పర్యవేక్షణ అధికారిగా కళాసాగర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కళాసాగర్

కంది, జూన్ 14 : సంగారెడ్డి జిల్లా కంది లోని సెంట్రల్ జైల్ పర్యవేక్షణ అధికారిగా కళాసాగర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సంతోష్ రాయ్‌ని హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. వరంగల్‌లోని ఖైదీల వ్యవసాయ క్షేత్రం అధికారిగా ఉన్న కళాసాగర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జైల్‌ను పరిశీలించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జైల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు, సలహాలు చేశారు. ఖైదీల సంఖ్య, సదుపాయాలు తదితర వివరాలను ఆరాతీశారు.

# తాగునీటి ఇబ్బందులను తొలిగిస్తాం..

జహీరాబాద్, జూన్ 14 : మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను తొలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం న్యాల్‌కల్ మండలంలోని మెటల్‌కుంట గ్రామంలోని బీసీ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎంపీ కోటాలో కొత్తగా బోరుబావి మంజూరైంది. ఈ సందర్భంగా స్థానిక కాలనీలో బోరు తవ్వేందుకు ఆయన భూమి పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఫీటర్‌రాజ్, నాయకులు మాణిక్‌రెడ్డి, నరేందర్, పాండురంగారెడ్డి, మైపాల్, శేఖర్, శాంసన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలి



రోడ్డు పక్కన ప్రమాదకరంగా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

సిర్గాపూర్, జూన్ 14 : మండలంలోని బొక్కసగాం, సుల్తానాబాద్ గ్రామాల మధ్య రోడ్డుకు పక్కనే కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. స్థానిక రైతుల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేశారు. కానీ దాని చుట్టూ రక్షణ వలయం మాత్రం చేపట్టలేదు. దీంతో ఇక్కడ వచ్చిపోయో వారికి, రోడ్డుపై సంచరించే పశువులకు ట్రాన్స్‌ఫార్మర్ ప్లాట్ ఫామ్ పరిసరాలు ప్రమాదాన్ని తలపిస్తుందని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె చుట్టూ ఫెన్సింగ్ చేయకపోవడం వల్లనే మండలంలోని ఆయా గ్రామాల్లో పలు చోట్ల పశువులు కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# స్కావెంజర్లపై పనిభారం మోపడం సరికాదు..

రామచంద్రాపురం,జూలై 14 : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లు, స్వీపర్లకు వేతనాలు పెంచకుండా వారిపై పని భారం మోపడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు, ప్రధానకార్యదర్శి ప్రసాద్ అన్నారు. శనివారం వారు భెల్‌లోని ఏఐటీయూసీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం స్కావెంజర్లు, స్వీపర్లకు రూ. 26 వేల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా తెలియచేయడం ఏమనగా, తెలంగాణ లోని సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, లక్డారం గ్రామం, సర్వే నెం. 738 లోని 4.23 హెక్టార్ల విస్తీర్ణములో M/s. సంతోష్ సాండ్ & గ్రానైట్ సప్లై వారు బిల్డింగ్ స్టోన్ మరియు రోడ్డు మెటల్ క్వారీ కొరకు EIA నోటిఫికేషన్ S.O. 1533, తేదీ. 14.09.2006 మరియు దాని సవరణలు ప్రకారం పర్యావరణ అనుమతి పొందియున్నారు వైడ్ గుర్తింపు నెం. EC25C0107TG5875185N తేదీ.26.05.2025. ఈ పత్రాలు పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ వెబ్ సైట్ నందు లభ్యమగును.

సం/-
M/s. సంతోష్ సాండ్ & గ్రానైట్ సప్లై

**PUBLIC NOTICE**

Under instruction of my client Sri Kolanuvada Bharath Kumar S/o. K. Sai Raju, aged 31 years, Occupation: Private Employee, now at residing at Villa 400, Road No 3, Symphony Park Homes, Patancheru Mandal, Sangareddy Dist., Telangana - 502319, lost my Indian Passport bearing Passport Number B7867551 while I am travelling from Beeramguda to Patancheru dated on 11-06-2025 noon hours. In spite of my best efforts, I could not find my passport, Still now not traced if in case anyone found this passport, please handover to me.

From
**M. VIJAY RAJ**
Advocate
Villa 116, Road no 8, Symphony Park Homes, Patancheru Town & Mandal Sangareddy Dist, Telangana. **Ph: 7207771008**